# గుండె మీద బండ

**జ**గమే మాయ!

నిజమే! ఈ మాయాలోకంలో అంతా అయోమయం. గందరగోళం. ఒకచోట వర్షాలెందుకు ముంచెత్తుతాయో, మరోచోట చుక్క నీరు ఎందుకు భూమ్మీద రాలదో ఎవరికీ తెలియదు.

ఇది పోనీ ప్రకృతి మాయాజాలం అనుకున్నా మనుషుల మాయాజాలాలకు ఎన్నింటికీ అర్థం ఉండదు. ఉదాహరణకి చక్కగా రోడ్లు వేశాక తీరిగ్గా కేబులు కోసం నిలువెత్తు గోతులెందుకు తవ్వుతారు? ఆదరా బాదరా డేములు కట్టేసుకుని పొరుగువాడే నీళ్ళొదిలాడు కాడని ఎందుకు గుండెలు బాదుకుంటారు? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలే!

అలాగే కమలపాడు ఊళ్లో గత ఎన్నో సంవత్సరాలుగా వున్న ఓ ప్రభుత్వ కార్యాలయం ఎందుకుందో ఎవరికీ తెలియదు. కానీ వుంది. మరి కార్యాలయం వుంటే సిబ్బంది వుండాలి కదా!

ఉన్నారు! ఓ జూనియర్ ఆఫీసరు, ఓ అకౌంటెంట్ కమ్ కేషియర్ కమ్ క్లర్కు ఒక టైపిస్టు, ఒక అటెండరూ ఉన్నారు.

ఏళ్ళ తరబడి ప్రమోషనివ్వక ఏడిపించేడిపించి ప్రమోషన్ వస్తే చాలు అనే స్థితికి వచ్చాకో బడుగు ప్రాణిని ఆఫీసరుగా వేస్తారు. ఆయన తెగ ఆనందపడిపోయి తిరుపతి వెళ్ళి గుండు కొట్టించుకుని చంకలు గుద్దుకుంటూ కమలపాడు వెళ్తాడు. తీరా అక్కడి పరిస్థితి చూశాక గుండెలు బాదుకుంటూ దొర్లి దొర్లి ఏడుస్తాడు. ఓ

నాలుగు రోజులు ఏడ్చి అయిదో రోజు నుంచి ట్రాన్సఫర్ కోసం ప్రయత్నిస్తాడు. అలా ఓ ఏడాదో రెండేళ్ళో ప్రయత్నం చేశాక మరో బడుగు జీవి నున్నగా గుండు కొట్టించుకొచ్చినప్పుడే ఇతనికి విడుదల, విముక్తి.

అకౌంటెంటు మాత్రం ట్రాన్సఫర్ కోసం ట్రై చెయ్యడు. ఎందుకంటే అతని స్వంత ఊరదే. ఇల్లూ వాకిలీ పొలం పుట్రా వున్నాయి. నెల్నెలా సంతకం పెట్టి జీతం తీసుకోవడం తప్ప దమ్మిడీ పని లేని ఉద్యోగం. ఊళ్ళో ఓ బడ్డీకొట్టు పెట్టుకొని నడుపుకుంటూ హుషారుగా వుంటాడు.

టైపిస్టుదీ ఆ ఊరే. కానీ అతనికి ఆస్తి పాస్తులేం లేవు – ఓ భార్య తప్ప. ఆవిడకీ ఈయనకీ సఖ్యత లేదు. అందుకని ఆఫీసులోనే కూర్చుంటాడు. మరి కూర్చున్నాక పనిచెయ్యాలిగా. టైపు మిషను ఇక్ష్వాకుల నాటిది. మీట నొక్కిన రెండు నిముషాల తరువాత ఆ అక్షరం తీరిగ్గా లేచి పైకెళ్ళి కాయితం మీద టపామని కొట్టి ఓ నిముషం తర్వాత బద్ధకంగా వచ్చి తన స్థానంలో కూర్చుంటుంది. ఈ కారణంగా ఒక్క లెటరు టైప్ చెయ్యాలంటే ఓ రోజంతా పడుతుంది. మధ్య, మధ్యలో దాని స్పీడు మరీ తగ్గిపోయి మొరాయిస్తుంటే తన స్వంత డబ్బులే అర్ధరూపాయి ఖర్చుపెట్టి కాస్త మంచి నూనె కొనుక్కొచ్చి ఓవరాయిలింగ్ చేస్తాడు. ఏదో విధంగా నెల గడిచిపోతుంది ఆయనకి.

ఇక నాలుగో ప్రాణి అటెండరు అంకయ్య. అతను ఉద్యోగంలో చేరిన రోజే ఆఫీసరు 'నీకు బుర్ర లేదు' అని తిట్టాడు. గవర్నమెంటు ఉద్యోగం అన్నా, గవర్నమెంటు ఆఫీసర్లు అన్నా దేవుడితో సమంగా గౌరవించే అంకయ్య ఆఫీసరు గారు తనని తిట్టేసరికి 'నిజంగానే నాకు బుర్ర లేదు కాబోలు, లేకపోతే అంత పెద్దాయన అలా ఎందుకంటాడు' అనుకున్నాడు.

అలా ఆయన రోజూ 'నీకు బుర్ర లేదు' అని తిడుతూ వుండడంతో నిజంగానే బుర్ర లేకుండా పోయింది. ఏ పనీ చెప్పినా ఎంత అస్తవ్యస్తంగా చేస్తాడంటే అంత తెలివి తక్కువగా ఎలా చేశాడా అని ముక్కుమీద వేలేసుకుంటారు జనాలు.

మొత్తానికి అకటవికటపు రాజు అవ్యక్తపు ప్రధాని, చెపితే వినని బంటు, చెవిటి తలారి అన్నట్లు ఉంటుంది. ఆ కార్యాలయంలో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యానికి గత ఏడాదిగా ప్రయత్నించగా ట్రాన్సఫర్ ఆర్డర్సు వచ్చాయి. వెంటనే వెళ్ళి పోదామను

కున్నాడు. కానీ రిలీవరు పార్థసారథి రావడం ఆలస్యం అయింది. ముందురోజే వస్తానన్నాడు. పెట్టే బేడా సర్దుకుని కూర్చున్నాడు సుబ్రహ్మణ్యం.

తిరుమలలో వున్నాననీ బాగా రద్దీగా వుండడం వల్ల దర్శనానికి నలభై ఎనిమిది గంటలు పట్టేలా వుందనీ, రావటం ఆలస్యం అవుతుందనీ ఫోన్ చేయించాడు పార్థసారథి.

సుబ్రహ్మణ్యానికి చిరాకొచ్చేసింది. కానీ ఏం చేస్తాడు? ప్రయాణం వాయిదా వేసుకున్నాడు. తెల్లవారింది. ఝాము పొద్దెక్కింది అయినా రిలీవరు అయిపూ ఆజా లేడు.

కోపం పోయి భయం పట్టుకుంది. కొంపతీసి ట్రాన్స్ఫర్ ఆపడానికి ప్రయత్నం చేస్తున్నాడా ఏం? ఇష్టదైవానికి ప్రార్థన చేసుకుంటూ కూర్చున్నాడు.

పొద్దున్నే బస్టాండుకి వెళ్ళిన అంకయ్య రెండుసార్లు బస్సు దిగిన పెద్ద మనుషులని దొరకబుచ్చుకుని గౌరవంగా తీసుకొచ్చాడు గానీ వాళ్ళిద్దరూ వేరేవాళ్ళే. అంకయ్యని తిట్టి వాళ్ళను పొమ్మన్నాడు సుబ్రహ్మణ్యం.

చివరికెలా అయితేనేం అపరాహ్నం వేళ అభిజిత్ లగ్నంలో బస్సు దిగాడు పార్థసారథి.

ఫలాని ఆఫీసు ఎక్కడ అని వాకబు చేశాడు.

అంకయ్య అప్పుడు అక్కడే వున్నాడు. కానీ పొద్దుటి నుంచి రెండుసార్లు జరిగిన భాగవతం చాలు – ఇప్పటికే అయ్యగారు మండిపడుతున్నారు – ఇప్పుడీయనని తీసుకెళ్తే ఏం చేస్తాడో ఏమో అని బీడీ కాల్చుకుంటూ వుండిపోయాడు.

పార్థసారథి నలుగురైదుగురిని అడిగి ఎలాగైతేనేం ఒకతని మోటారు సైకిల్ మీద కూర్చుని ఆఫీసుకి చేరాడు.

మనిషి నిలువెల్లా దుమ్ముకొట్టుకుపోయి ఆఫీసుకి చేరిన పార్థసారథిని ఆదరంగా రిసీవ్ చేసుకున్నాడు సుబ్రహ్మణ్యం.

“నేనొస్తున్నానని తెలుసుకదండీ. ఎవర్నైనా బస్టాండుకి పంపకపోయారా?” అన్నాడు పార్థసారథి అసహనంగా.

“అటెండరుని పంపాను కదా?” అన్నాడు సుబ్రహ్మణ్యం.

“పంపితే ఏడీ?” చిరాగ్గా అడిగాడు పార్థసారథి.

“రాలేదా? వాడుత్త మొద్దు వెధవ. ఎటుపోయాడో ఏమిటో?”

"అంత మొద్దు వెధవని ఎందుకు పంపించారు? మంచివాడ్నెవడ్నైనా పంపొచ్చు కదా?" నిలదీశాడు పార్థసారథి.

ఇక్కడ పుంజీల కొద్దీ మనుషులు లేరు. మంచివాడిని వెతికి పంపడానికి. వున్నది వాడొక్కడే" అన్నాడు చిరాగ్గా సుబ్రహ్మణ్యం.

లోలోపలే సణుక్కుని వూరుకున్నాడు పార్థసారథి.

ఇక తర్వాత జరగాల్సిన కార్యక్రమం మొదలైంది.

టైపిస్టు సరే యథాప్రకారం ఆఫీసులోనే వున్నాడు.

ఆ వేళ కొత్త ఆఫీసరు గారు వస్తారని తెలుసు కాబట్టి అకౌంటెంటు కూడా ఆపద్ధర్మంగా బడ్డీ కొట్టు మీద ఎవర్నో కూర్చోపెట్టి అరగంటకో మారు ఆఫీసు వైపు వచ్చి వెళ్తున్నాడు.

అకౌంటెంటు, అంకయ్య ఇంచుమించుగా ఒకేసారి ఆఫీసుకి వచ్చారు. యథాప్రకారం అంకయ్యకు అక్షింతలు వేసి, యథాప్రకారం అతడు దులిపేసుకున్న తర్వాత కాసిని కాఫీ నీళ్ళు తాగి హేండింగ్ ఓవర్ కార్యక్రమం ప్రారంభించారు.

డబ్బు లెక్కలూ, ఇక్ష్వాకుల కాలం నాటి ఫైళ్ళు, అన్నీ అందజేశాక ఆఫీసులో వున్న వస్తువుల వంతు వచ్చింది. ఆ ఫైల్ తీశారు.

ఐటమ్ నెంబర్ వన్ ఇనప బీరువా. టూ ఇనప రేక్, నెంబర్ త్రీ కర్ర టేబుల్.

ఇలా సాగిపోతోంది ఆ జాబితా.

ఐటమ్ నెంబర్ ఇరవై రెండు స్టోన్.

వస్తువులన్నీ చెక్ చేసుకుంటున్న పార్థసారథి ఆగిపోయాడు.

"ఏమిటీ ఏమిటన్నారూ? స్టోన్ అంటే రాయి?" అడిగాడు.

"అవునండీ రాయే" చెప్పాడు సుబ్రహ్మణ్యం.

"రాయితో మనకేం పని? రాయెందుకుంది ఇక్కడ?" మళ్ళీ అడిగాడు పార్థసారథి.

"ఏమోనండీ. రామకృష్ణగారు నాకు హేండోవరు చేశారు. నేను మీకు హేండోవరు చేస్తున్నాను" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మరి మీకే సందేహం రాలేదా? ఈ రాయి ఏమిటని అడగలేదా?"

"అడక్కేం అడిగాను. ఏమో మరి నాకు మోహనరావు ఇచ్చాడు నేను మీకిస్తున్నాను అన్నాడు" – వివరంగా చెప్పాడు సుబ్రహ్మణ్యం.

"ఏదీ ఆ రాయి నేను చూడాలి" అన్నాడు పార్థసారథి.

"అయ్యో దానికేం భాగ్యం. మహారాజులా చూడండి" అంటూ తీసికెళ్ళాడు సుబ్రహ్మణ్యం.

ఆఫీసు వెనకాల ఖాళీస్థలంలో వుందా బండరాయి.

నల్లగా నిగనిగ లాడుతోంది. దాని మీద వున్న నెంబరు ఫైల్లో వున్న నెంబరుతో టేలీ అయింది.

"ఏమిటీ రాయి? ఎందుకిక్కడ వుంది? దీనివల్ల మనకేం ప్రయోజనం? ఇది మన ఆఫీసు ప్రాపర్టీస్‌లో ఎందుకు చేరింది?"

ఆ ప్రశ్నల వర్షానికి విసిగిపోయాడు సుబ్రహ్మణ్యం.

"అవన్నీ తర్వాత తీరిగ్గా చూసుకోండి. ముందు ఫార్మాలిటీస్ ముగించి సంతకం పెడితే నేను పోతాను. ఈ బస్ వెళ్ళిపోతే సాయంత్రం దాకా బస్సు లేదు నాకు" అన్నాడు అసహనంగా.

మిగిలినవన్నీ చూసుకుని ఫైల్లో సంతకం పెట్టాడు పార్థసారథి.

సుబ్రహ్మణ్యం వెళ్ళిపోయాడు.

అవడానికి అదొక గ్రామం. తిండికి నానా అగచాట్లు పడాలి. మాంసాహారులకి ఫర్వాలేదు. ఓ కోడి కోయించి కూరొండుకు తినచ్చు లేదా ఎండిపోయే చెరువుల్లో దొరికే చేపలు తినచ్చు. శాకాహారుల పనే కష్టం. నెలకి ఇరవై రోజులు బంగాళాదుంపలే తినాలి.

పల్లెటూరు – కాలక్షేపం వుండదు. మండిపోయే ఎండలు. అక్కడ కుటుంబం వెంట లేకుండా వంటరిగా వుండడం నరకం. కానీ పార్థసారథికి అవేం పట్టలేదు.

అతన్ని వేధిస్తున్న సమస్య ఒక్కటే!

ఆ రాయి అక్కడ ఎందుకుంది?

ఆ రాయి వివరాలేమైనా దొరుకుతాయోమోనని పాత ఫైళ్ళన్నీ వెతికి చూశాడు.

ఇంచు మించు ఇరవై ఏళ్ళ ఫైల్సు వున్నాయి.

చెక్క బీరువాలు పోయి ఇనప బీరువాలు వచ్చాయి. ఇనప టేబుళ్ళు చెక్క టేబుళ్ళుగా మారాయి గానీ ఐటమ్ నెం. ఇరవై రెండుకి మాత్రం ఏ మార్పూ లేదు.

అప్పుడూ రాయే! ఇప్పుడూ రాయే!!

పల్లెటూర్లలో సామాన్యంగా రాళ్ళూ రప్పలకు పూజా పునస్కారాలు జరుగుతాయి. ఈ రాయికి కూడా ఏమైనా మాహాత్మ్యం వుందేమోనని ఊరి పెద్దలని విచారించి చూసాడు. అలాంటిదేమీ లేదని తెలిసింది.

ఆ రాయి కింద ఏమైనా నిధి నిక్షేపాలుంటాయేమో తవ్వించి చూద్దాం అనుకున్నాడు.

అలా తవ్వాలంటే బండని దొర్లించాలి. తవ్వాలి. అదో పని. దానికి పర్మిషన్ కావాలి. డబ్బు శాంక్షన్ కావాలి.

వుట్టినే తవ్వకాలు సాగిస్తామంటే ఎవరూ ఒప్పుకోరు. కాబట్టి వాటర్ హార్వెస్టింగ్ పథకం మీద రెయిన్ వాటర్ పిట్ కోసం అని పైకి రాసి శాంక్షన్ చేయించుకున్నాడు.

రెండు నెలల తర్వాత శాంక్షనైంది. మంచి రోజు చూసి కూలీలను పెట్టి బండ దొర్లించి గుంట తవ్వించారు. పని జరుగుతున్నంత సేపూ తిండీ నీళ్ళూ మానేసి అక్కడే నుంచున్నాడు పార్థసారథి.

కానీ తన అన్వేషణ మాత్రం ఆపలేదు.

ఆర్కియాలజీ డిపార్టుమెంటు వాళ్ళకి రాశాడు.

వాళ్ళ మనిషి వచ్చి చూసి, 'నున్నగా చలిమిడి వుండలా వుంది శాసనాలు అవీ ఏం లేవు. ది సీజ్ జస్ట్ ఏన్ ఆర్డినరీ స్టోన్' అని రాసి ఇచ్చి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఇందులో ఖనిజాలేమైనా వున్నాయేమో అని వారికి రాశాడు.

వాళ్ళూ వచ్చి చూసి ఏమీ లేవని తేల్చేశారు.

రోజు రోజుకీ పార్థసారథి ఆరాటం పెరిగిపోతోంది. కంటికి నిద్రలేదు. ఒకటే ఆరాటం. ఆ రాయి ఏమిటో తెలుసుకోవాలి. మనిషి దొరికితే చాలు వేపుకు తింటున్నాడు. అతనటు వస్తుంటే ఇటు పారిపోతున్నారు జనాలు. ఇంట్లో వాళ్ళు కూడా ఈ సొద భరించలేక ఈ శనాది వారాలు మేము చుట్టాలింటికి పెళ్ళికి వెళ్తున్నాం మీరు రాకండి అని చెపుతున్నారు.

అలా ఓ ఏడాది గడిచిపోయింది.

ఏదో నాలుగు రోజులు ఆరాటపడి ఊరుకుంటాడులే అనుకున్న అతని స్టాఫు ఇతని ఉడుం పట్టు చూసి విసుక్కుంటున్నారు.

దినం అస్తమానం ఆ బండ చుట్టూ తిరుగుతుంటాడు. ఏదేదో మాట్లాడుకుంటూ వుంటాడు. ఇతని తీరు చూస్తుంటే పిచ్చివాడయ్యేలా వున్నాడు... అనుకున్నారు.

ఆ ఏడాది అతను పనిచేసే ఊళ్ళోని స్కూలు వారు వజ్రోత్సవం జరుపు కుంటున్నారు. అంతా ఆర్భాటంగా చేస్తున్నారు. ఆ స్కూలుకి సంబంధించిన వయోవృద్ధులని పదిమందిని పిలిపించి శాలువలు కప్పి సత్కరించాలనుకున్నారు.

ఆ కార్యక్రమానికి పార్థసారథికి కూడా ఆహ్వానం వచ్చింది. వెళ్ళాడు. కార్యక్రమం మొదలైంది. సన్మానాలు అయ్యాయి. ఒకరిద్దరు ఏవో నాలుగు మాటలు మాట్లాడారు.

ఆఖరాయన మాత్రం మైకు పట్టుకుని ఓ పట్టాన వదల్లేదు. ఆయన పేరు రామావతారం. ఆయన వయసు డెబ్బై అయిదేళ్ళు. ముందర కొంతకాలం ఆ స్కూల్లో టీచరుగా పనిచేసి ఆ తర్వాత గవర్నమెంటు ఉద్యోగం వస్తే వెళ్ళిపోయాడట. కొన్నాళ్ళు అక్కడ ఇక్కడా తిరిగినా చివరి పదిహేను సంవత్సరాలూ ఇక్కడి ఆఫీసులోనే పని చేశాడుట.

ఉద్యోగంలో చేరినదీ ఈ ఊరే, రిటైర్ అయిందీ ఈ ఊరే. ఇప్పుడు కొడుకు దగ్గర వుంటున్నా ఈ ఊరుతో నాకు విడదీయలేని సంబంధం వుంది అంటూ మొదలు పెట్టి జ్ఞాపకాలు నెమరువేస్తూ నలభై అయిదు నిముషాలు చెప్పాడు. వింటున్న జనం విసిగిపోతున్నారు. ఆయనని మైకు దగ్గర నుంచి లాగడానికి ఎన్నో విధాల ప్రయత్నిస్తున్నారు.

చివరికెలాగైతేనేం ఆయన చేత 'నాకీ అవకాశం ఇచ్చినందుకు మీ అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ నేనింతటితో శెలవు తీసుకుంటున్నాను' అనిపించగలి గారు.

అందరితోపాటు పార్థసారథి కూడా ఊపిరి పీల్చుకున్నాడు.

కానీ పార్థసారథి ఊపిరి పీల్చడం వెనక గల కారణం వేరు. వయోవృద్ధుడు, చాలా ఏళ్ళ కిందట ఈ ఆఫీసులోనే పని చేశాడు. ఆయనికి ఆ రాయి గురించి తెలిసే వుంటుంది. ఏమైనా ఆధారాలు దొరుకుతాయేమో!

ఆయన స్టేజి దిగగానే వెళ్ళి ఆయనని కలుసుకున్నాడు. తనని పరిచయం చేసుకున్నాడు.

తనెప్పుడో పనిచేసిన ఆఫీసులో ఇప్పుడు పనిచేస్తున్న ఆఫీసరు హఠాత్తుగా కనిపించేసరికి పరమానందభరితుడయ్యాడు రామావతారం.

ఎన్నో వివరాలు అడిగాడు. ఆయన జ్ఞాపకశక్తికి ముచ్చటేసింది పార్థసారథికి.

సభ దాదాపు ఖాళీ అయింది. వీళ్లిద్దరే ఒక మూలగా కూర్చున్నారు.

"సార్ మన ఆఫీసులో వెనక ఒక పెద్ద బండరాయి వుంది. అది అక్కడెందుకు వుందో పెద్ద మిస్టరీగా తయారైంది. దాని గురించి మీకేమైనా తెలుసా?"

ఒక్కక్షణం 'శంకరాభరణం' సినిమాలో 'సామజవరగమనా' పాట సీనులో సోమయాజుల్లా మొహం పెట్టి ఆలోచించాడు రామావతారం.

'అదా! ఆ రాయి ఇంకా అక్కడే వుందిటయ్యా?" అన్నాడు సంభ్రమాశ్చర్యాలతో.

"వుంది సార్. దాని గురించి మీకు తెలుసా?"

"భలేవాడివే నాకు తెలియకపోవడం ఏమిటి? ఒక రకంగా అది నా బ్రెయిన్ చెయిల్డు" అన్నాడు రామావతారం.

సీతాదేవి కోసం అడవుల్లో వెతుకున్న శ్రీరామచంద్రుడికి మారుతి ఎదురైతే ఎటువంటి ధైర్యం కలిగిందో అటువంటి ధైర్యం కలిగింది పార్థసారథికి.

"చెప్పండి సార్" అన్నాడు ఉద్వేగంతో.

"ఇక్కడంతా రొదగా వుంది. ఎక్కడైనా తీరిగ్గా కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాడు రామావతారం.

వెంటనే ఆయనని తన ఆఫీసుకి తీసికెళ్ళాడు పార్థసారథి.

వెన్నెల్లో మెరుస్తున్న ఆ రాయిని చూసి చిన్నగా నవ్వి ఆ తర్వాత పగలబడి నవ్వాడు రామావతారం.

"చెప్తాను విను" అంటూ ఫ్లాష్‌బాక్ మొదలు పెట్టాడు.

గతంలో ఇద్దరు వ్యక్తులుండేవారు. వేదాంబుజన్, రాఘవేంద్రరావు. ఇద్దరూ ఒకే రోజున ఉద్యోగంలో చేరారు.

రాఘవేంద్రరావు కొందరి అభిమానానికి పాత్రుడై త్వరత్వరగా ప్రమోషన్లు కొట్టేశాడు.

వేదాంబుజన్ మాత్రం వెనకబడిపోయాడు. అతనికీ ప్రమోషన్ వచ్చింది కానీ రాఘవేంద్రరావు తర్వాత మూడేళ్ళకి. జరిగినదాంట్లో పాపం రాఘవేంద్రరావు తప్పేమీ లేకపోయినా వేదాంబుజన్ అతని మీద కత్తి కట్టి కాల్చుకుతిన్నాడు.

ఆకాశరామన్న ఉత్తరాలు ఆఫీసర్లకు రాసి అదుగో ఫలానా రాఘవేంద్రరావు ఆఫీసు ఫర్నిచర్ ఇంటికి పట్టుకుపోయాడు, ఇదుగో ఫలాని రాఘవేంద్రరావు గవర్నమెంటు వెహికల్‌ని దుర్వినియోగం చేశాడు... అంటూ ఊదర పెట్టాడు.

ప్రతీసారీ ఆఫీసరు పిలిచి సంజాయిషీ అడగడం మొదట్లో బాధగా వున్నా ఆ తరువాత అలవాటయిపోయింది రాఘవేంద్రరావుకి.

అలా ఓ రెండేళ్ళు గడిచాయి. రాఘవేంద్రరావుకి కమలపాడు ట్రాన్స్‌ఫర్ అయింది. అక్కడికి వెళ్ళాక ఏడాది అయ్యాక మళ్ళీ టౌన్‌కి ట్రాన్స్‌ఫర్ చేశారు. అంతవరకూ బాగానే ఉంది.

అతని స్థానంలో ప్రమోషనిచ్చి వేదాంబుజన్‌ని పోస్ట్ చేశారు. మళ్ళీ ఏం మడత పేచీ పెడతాడో అని భయం వేసింది రాఘవేంద్రరావుకి. ఒకటికి రెండుసార్లు అన్నీ సరిచూసుకున్నాడు.

తీరా తెల్లవారితే అతను వస్తాడనగా ఐటమ్ నెంబరు ఇరవై రెండు మిస్సింగ్ ఉండాల్సినవన్నీ వున్నాయి.

“ఏమిటా ఆ ఐటమ్?” అని పాత ఫైళ్ళు వెతికి చూశారు.

ఎప్పుడో అక్కడికి దగ్గర్లో టీ కొట్టు కూడా లేని రోజుల్లో టీ కాచుకునేందుకు గాను కిరసనాయిలు స్టౌ ఒకటి శాంక్షను చేయించుకున్నారు.

కాలక్రమేణా దాని ఉపయోగం లేక తుప్పు పట్టిపోతే అవతల పారేశారు. రూలు ప్రకారం అలా పారెయ్యకూడదు. అదిక పనికిరాదని కండెమ్ చేసి స్క్రాప్ అకౌంట్లో హెడ్ ఆఫీసుకి పంపించాలి. ఈ తతంగం అంతా జరగాలంటే పది రోజులు పడుతుంది. ఎవరో బద్ధకిస్టు అంత శ్రమ పడలేక పారేశాడు.

ఇపుడు ఆ స్టౌ రాఘవేంద్రరావుకి ఓ తలనొప్పిగా మారింది. మామూలు వాళ్ళైతే పట్టించుకోరు. కానీ వస్తున్న వాడు వేదాంబుజన్. చండశాసన ముండాకొడుకు.

ఇక ఒక్కటే మార్గం, కొత్త స్టా కొని ఆ లోటు భర్తీ చెయ్యాలి. కానీ ఆ ఊళ్ళో సంతనాడు తప్ప అగ్గిపెట్టె కూడా దొరకదు.

అప్పటికప్పుడు పక్క టౌన్‌కి పంపించి తెప్పిద్దామన్నా, అక్కడ కొట్టు తెరవాలి. వీళ్ళు తేవాలి. ఇంతా చేసి స్టా వచ్చేలోగా వేదాంబుజన్ వచ్చేస్తే???

అందరూ బుర్రలు బద్ధలు కొట్టుకుంటూ వుండగా రామావతారానికి ఒక ఆలోచన వచ్చింది.

"వద్దొద్దు" అన్నాడు రాఘవేంద్రరావు.

"ఫర్వాలేదు మీరు ధైర్యంగా ఛార్జీ హేండోవరు చేసేయండి. మేము అడ్డంగా వాదించేస్తాం" అన్నాడు రామావతారం.

"సరే" అన్నాడు రాఘవేంద్రరావు.

ఎస్‌టిఓవీయీ స్టౌని, ఎస్‌టిఓఎన్‌యీ స్టోన్ (Stone) గా దిద్ది ఆరు బయట పడివున్న బండరాయి మీద పెయింట్‌తో ఐటమ్ నెంబరు వేసేశాడు.

వేదాంబుజన్ వచ్చాడు చూశాడు. "కల్లు? కల్లుతో మనకేం వేల అప్పా" అని అడిగాడు.

"అదేమో మాకు తెలీదు చాలాకాలంగా ఇది ఇలాగే వుంది" అని దబాయించి పారేశారు.

రాఘవేంద్రరావు వెళ్ళిపోయాడు. ఆ ఊళ్ళో వున్న ఆర్నెల్లూ ఆ కల్లు చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు వేదాంబుజన్.

"అప్పుడాయన. మళ్ళీ ఇన్నాళ్టికి నువ్వు" అని పార్థసారథి భుజం తట్టి కథ ముగించాడు రామావతారం.

*రచన మాసపత్రిక ఫిబ్రవరి 2004*